# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భూమి అనేది ప్రతి ఒక్కరికి జీవనాధారం, భద్రత, గౌరవమని పేర్కొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **పోలీస్ శాఖలో సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నట్లు తెలిపిన హోంమంత్రి వంగలపూడి అనిత.**

3. **ప్రభుత్వం చేపట్టిన జలధార కార్యక్రమంలో రైతులు కూడా భాగస్వాములు కావాలని కోరిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.**

4. **రహదారి భద్రత చర్యల్లో భాగంగా పలు బస్సులను ఆకస్మిక తనిఖీ చేసిన రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.**

==========================

భూమి అనేది ప్రతి ఒక్కరికి జీవనాధారం, భద్రత, గౌరవమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో "మీ భూమి – మీ హక్కు" కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి, సూర్యలంక బీచ్ టూరిజం, పిఎన్‌జి సరఫరాపై వివిధ స్టాళ్లను ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

పోలీస్ శాఖలో సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఏలూరు జిల్లా పెదపాడులో పోలీస్ స్టేషన్ భవనాన్ని హోంమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే గంజాయి అక్రమ రవాణా భారీగా తగ్గిందని పేర్కొన్నారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో జలధార కార్యక్రమంలో భాగంగా

కాలువలు.. చెరువులు మరమ్మతుల కోసం 28 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆత్మకూరులో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలధార కార్యక్రమం కింద నియోజకవర్గంలోని వివిధ చెరువులు, కాలువలకు మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. ఈ జల ధార కార్యక్రమంలో రైతులు కూడా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

---------------------------

రహదారి భద్రత చర్యల్లో భాగంగా గుంటూరు జిల్లా ఖాజా టోల్ ప్లాజా వద్ద పలు బస్సులను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గత రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. సరైన పత్రాలు, భద్రత ప్రమాణాలు లేని 20కు పైగా బస్సులను అధికారులతో కలిసి తనిఖీ చేసిన మంత్రి ఒక బస్సును సీజ్ చేయాలని, మరో 15 బస్సులపై జరిమానాలను విధించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బస్సుల సాంకేతిక స్థితి, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు, భద్రతా ప్రమాణాల అమలు, డ్రైవర్లు సిబ్బంది విధి నిర్వహణలో పాటిస్తున్న నియమాలు, వేగ పరిమితులు, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలుపుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

మత్స్య సంపద పునరుత్పత్తికి ఆటంకం కలగకుండా తీసుకునే చర్యల్లో భాగంగా బంగాళాఖాతం తూర్పుతీరంలో ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేట నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు నిన్న జారీ చేసింది. అన్నిరకాల మెకనైజ్డ్ బోట్లు, ఇన్‌బోర్డు, ఔట్‌బోర్డు మోటార్లు అమర్చిన పడవలకు నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, తమిళనాడు, అండమాన్ నికోబార్ రాష్ట్రాల పరిధిలో ఇది వర్తిస్తుందని వెల్లడించింది.

---------------------------

దేశ వ్యాప్తంగా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 8వ పోషణ పఖ్వాడా--2026 కార్యక్రమాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది పోషణ పఖ్వాడా 'మొదటి ఆరు సంవత్సరాల్లో మెదడు అభివృద్ధి గరిష్టంగా పెంపొందించడం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు, పోషణ పంచాయతీలు, ఆటల ఆధారిత అభ్యాస కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చిన్నారుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, స్క్రీన్ టైమ్ తగ్గింపు వంటి అంశాలపై ప్రచారం చేపట్టనున్నారు.

---------------------------

మహిళా సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను తిరుపతి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంతో పలు రంగాల్లో శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ పథకం ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందిన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామానికి చెందిన పుష్ప ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్..25 సెకన్లు

---

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి చెరువులను నింపడం ద్వారా రైతులకు భరోసా కల్పించడమే జల ధార–నీటి భద్రత కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం జగన్నాథపురంలో ఆయన నిన్న పర్యటించారు. చెరువు పక్కన రైతు పర్వతనేని బాబ్జి సొంతంగా నిర్మించుకున్న ఇంజక్షన్ బావులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఇంజక్షన్ బావుల నిర్మాణం, పనిచేసే విధానాన్ని రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---

ఏలూరు జిల్లాలో వంట గ్యాస్ కు ఎటువంటి కొరత లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లకు కొరత ఏర్పడనుందంటూ వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. ఇటువంటి అవాస్తవాలను వ్యాపించే వారిపై చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల నిరంతర సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు.

---

విజయవాడ నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు వినూత్నంగా డ్రోన్ల ద్వారా నీటి తుంపర్లు వెదజల్లే కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ క్షేత్రస్థాయిలో ఈరోజు పరిశీలించారు. నగరంలోని మహాత్మా గాంధీ రోడ్, అంబేద్కర్ స్మృతి వనం వద్ద ఈ కార్యక్రమాన్ని విజయవాడ మున్సిపల్ కార్పరేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. నగరంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు వీఎంసీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు.

---

పశువులు, జీవాలు వేసవిలో తాగు నీటి కోసం ఇబ్బంది పడకుండా పశు పోషకులు, స్వయం సహాయక సంఘాల వారు కోరిన చోట నీటి తొట్టెలను ఏర్పాటు చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి.దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం వారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో లేదా, స్థానిక పశు వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు.

---

వేసవి రద్దీ నేపథ్యంలో జోన్ పరిధిలోనూ, జోన్ నుంచి ఇతర జోన్లకు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే తెలిపింది. 'ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు వివిధ రూట్లలో 46 ట్రిప్పుల అదనపు రైళ్లు అందుబాటులో తీసుకువస్తున్నట్లు నిన్న ఒక ప్రకటనలో పేర్కొంది.

---

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి నేరుగా మొట్టమొదటి రెగ్యులర్ రైలు సర్వీసు మంజూరైంది. ఈ మేరకు రైల్వే శాఖ ఉత్వర్వులు జారీ చేసింది. రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 13 నుంచి ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

====================